# బాలినాయుడి కథ

## వడ్లమన్నాటి కుటుంబరావు

బహుముఖ ప్రజ్ఞాశాలి బాలినాయుడంటే... మా ఇంటిల్లిపాదికీ ఎంతో ఇష్టం! మహిళల సమస్యల మీద సమాజానికి కనువిప్పు కలిగేలా కథలు- నవలలు రాసే రచయితగా అతనంటే నా శ్రీమతికి ఎంతో అభిమానం.

కిషోర్‌కుమార్‌లా పాడగలిగే అతని గొంతంటే సీనియర్ ఇంటర్ చదువుతున్న మా అమ్మాయికెంతో ఇష్టం.

ప్రపంచం మొత్తంమీద క్రేజీ గేం క్రికెట్ మీద అతనికి గల అపారమైన జ్ఞానమంటే టెన్త్ పాసయిన మా అబ్బాయికి వళ్ళు తెలియనంత ఇష్టం.

కామెడీ, ట్రాజెడీ రెండు రకాల పాత్రలను వేసి మెప్పించి ఒప్పించగల రంగస్థల నటుడిగా బాలినాయుడంటే నాకు చాలా చాలా ఇష్టం.

వీటన్నిటి దృష్ట్యా అతను మా ఇంట్లో ఒక కుటుంబ సభ్యుడిగా స్థానం సంపాదించుకున్నాడు.

ధనవంతుడై వుండికూడా గుణవంతుడవడం... నిగర్వీగా కలుపుగోలుతనంగా వుండడం వల్ల అతని స్నేహానికి నేను దాసోహమయ్యాననే చెప్పాలి.

అతను ఎప్పుడు వచ్చి తన కారెక్కమన్నా.. సినిమాకు గాని, షాపింగుకు కాని కంపెనీ ఇవ్వమన్నా నేను రెడీగానే వుండేవాణ్ణి.

అయితే, బాలినాయుడి విషయంలో ఒక్క సంగతి మాత్రం నాకు రుచించలేదు. నా శ్రీమతి కూడా ఆ విషయాన్ని పదే పదే ఉదహరిస్తూ నా మనసును రెచ్చగొడుతూ వుండేది.

"ఏమిటండీ! అన్నయ్యగారు వదినగార్ని, పిల్లల్ని ఒక్కసారి కూడా మనింటికి తీసుకురాలేదు? మనం అంత కానివాళ్ళమా? పోనీ మనలనైనా ఒకసారి వాళ్ళింటికి రమ్మనమని ఆహ్వానించవచ్చుగా! ఆ పనీ చేయలేదు. పైగా నేనా ప్రస్తావన తెచ్చినప్పుడల్లా ఏవో మాటలతో దాటేస్తుంటారు. కారణమేమిటి?

శ్రీమతికి నేనేం సమాధానం చెప్పను? అక్కడికీ ఈ విషయంలో నాలుగయిదుసార్లు హెచ్చరించాను బాలినాయుడ్ని.

"చెల్లెమ్మనీ, పిల్లల్నీ ఒకసారి కారులో మా ఇంటికి తీసుకురావోయ్.. లేదంటే మేమంతా మీ ఇంటికి వస్తాం..." అన్నాను కూడా.

ఒకటి రెండుసార్లు చిరునవ్వుతో దాటేశాడు.

మరోసారి సడన్‌గా టాపిక్ మార్చేశాడు.

నా మనసు చివుక్కుమంది. అయినా పైకి మామూలుగానే వున్నాను.

ఒకరోజు శ్రీమతి "అన్నయ్యగారి వాళ్ళింటి పక్కన వున్న గున్నమ్మగారు మన పక్కింటి పున్నమ్మగారింటికి వస్తుంటుంది. ఆమె ద్వారా ఖూపీ లాగాను. అసలు రహస్యం పట్టేశాను. అద్గదీ కత!" అంది ఉత్సాహంగా.

ఏమిటో త్వరగా చెప్పమన్నట్టు చూశాను శ్రీమతి కేసి.

"వదినగారు పది లక్షల కాష్, వంద తులాల బంగారం పట్టుకొచ్చిందట కట్నంగా. అష్టలక్ష్మీదేవిలా నగలన్నీ అలంకరించుకుని సోఫాలో తాపీగా కూర్చుంటుందట. వాళ్ళమ్మాయి చందన కుందనపు బొమ్మలా వుంటుందట. బి.ఎ. పాసయిన ఆ అమ్మాయికి రాజకుమారుడిలాంటి వరుడికోసం గాలిస్తున్నారట. వాళ్ళబ్బాయికి సీనియర్ ఇంటర్‌లో రాష్ట్రం మొత్తం మీద ఫస్టు రాంకు వచ్చిందట. బి.టెక్.కు ఎంట్రన్స్ రాస్తే టక్‌మని సెలక్షన్ వచ్చిందట."

"దీన్లో తెలియని విశేషమేముంది? అన్నీ తెలిసిన శుభవార్తలే కదా. సంతోషం" అన్నాన్నేను.

"అయ్యో ఖర్మ! ఇంతేనా మీ బంగారు బుర్రకి తట్టింది? ఇవన్నీ చూసుకుని బాలన్నయ్యగారికి చాలా గర్వమట. తను ఒకళ్ళింటికి వచ్చి కుటుంబ సభ్యులందరితో సరదాగా మాట్లాడుతూ కాలక్షేపం చేస్తాడట గాని... తన ఇంటికి స్నేహితుల్ని, వాళ్ళ ఫామిలీలను రానివ్వడట. చాలా గర్విష్ఠి అట లోలోపల. చూశారా మీ ఫ్రెండు జీవితంలో కూడా ఎంత నటుడో? అందరూ మనలాంటి పిచ్చిమాలోకాలే వుంటారా?"



శ్రీమతి పోరు నా మెదడులో హోరు సృష్టించింది. 'ఏమైనా సరే ఈ విషయం అటో ఇటో తేల్చెయ్యాలి బాలినాయుడితో' అనుకున్నాను ఆవేశంగా.

"సర్లే! నేను చూస్తాలే" అని సర్దిచెప్పాను శ్రీమతికి.

రెండో రోజు సాయంత్రం నాలుగింటికి బాలినాయుడి కారు హారన్ వినిపించింది. మా ఫాన్సీ షాపుకి సెలవు కావడం వల్ల నేను ఇంట్లో కూర్చుని వీక్లీ చదువుకుంటున్నాను.

పిల్లల్ని, శ్రీమతిని పిలిచి సన్నగా "మీరేం మాట్లాడకండి. మౌనంగా కాఫీ టిఫెన్లు గుమ్మెక్కించండి. అసలు విషయం నాకొదిలేయండి" అంటూ లేచివెళ్ళి బాలినాయుడిని సాదరంగా లోనికి ఆహ్వానించాను.

"కారులో అలా ఊరి బయటకు వెళ్ళి కబుర్లు చెప్పుకుందాం రారాదూ? ఏం తోచడంలేదు" అన్నాడు బాలినాయుడు.

"నువ్వు వాకిట్లోకి వచ్చి, ఇంట్లోకి రాకుండా వెడితే మీ చెల్లెమ్మ, పిల్లలు నన్ను ఊరుకుంటారా? హంటర్ పెట్టి..." అంటూ ఆపాను నవ్వుతూ.

అర్థం కానట్టు కళ్ళెత్తి చూశాడు బాలినాయుడు కారు దిగివస్తూ.

" వాళ్ళని వాళ్ళే కొట్టుకుని బాధపడతారు" అంటూ ముగించాను.

భళ్ళున నవ్వుతూ అన్నాడు బాలినాయుడు –

"ఏమిటోయ్ నీలోనూ రచయిత అయ్యే లక్షణాలు కనిపిస్తున్నాయ్?"

"నేను రచయితనయినా కొంతమందిలా పోజు పెట్టను" అప్రయత్నంగా అనేశాను.

"ఏమిటోయ్ ఇవ్వాళ కొత్తగా వుంది అబ్బాయిగారి ధోరణి?" ఆశ్చర్యంగా అన్నాడు బాలినాయుడు.

"ఏం లేదుగానీ .. లోపలకు రా!" అన్నాను మామూలుగా.

లోపలకు వచ్చినతర్వాత బాలినాయుడొక కుర్చీలో .. నేనో కుర్చీలో కూర్చున్నాం. ఇద్దరి మధ్యలో టీపాయ్ వుంది.

శ్రీమతి - స్వీటు ప్లేట్లు రెండు తెచ్చి టీపాయ్ మీద పెట్టి వెళ్ళిపోయింది మాటా పలుకూ లేకుండా.

మా అమ్మాయి రెండు చెగోడీ ప్లేట్లు అక్కడ పెట్టి వెళ్ళిపోయింది మౌనంగా.

మావాడు రెండు మంచినీళ్ళ గ్లాసులు .. రెండు రస్నా గ్లాసులు అక్కడ పెట్టి వెళ్ళిపోయాడు ఉలుకూ పలుకూ లేకుండా.

"ఏమిటోయ్ ఈ సైక్లోన్? చెల్లెమ్మా .. పిల్లలూ .. అలా మౌనవ్రతం పట్టేశారేమిటి? నావల్ల ఏమన్నా పొరపాటుగాని జరగలేదు కదా?"

"ముందు తిను" అన్నాన్నేను అదేమీ పట్టించుకోనట్టుగా.

"అదేం కాదు .. అసలు విషయం ఏమిటో చెప్పు"

రెట్టించాడు బాలినాయుడు.

"ఏమిటో నువ్వే అడుగు మీ చెల్లెమ్మని, పిల్లల్ని" అన్నాను విష్టారంగా.

"చెల్లెమ్మా" అంటూ పిలిచాడు బాలినాయుడు నా శ్రీమతిని ఆప్యాయంగా.

"చాలించండన్నయ్యగారూ మీ నాటకాలు! మీరు గొప్ప డ్రామా యాక్టరని మాకు తెలుసులెండి" శ్రీమతి ఉక్రోషం పట్టలేక ఆక్రోశించింది.

"ఏమిటి చెల్లెమ్మా ఏమయింది" కంగారుగా అడిగాడు బాలినాయుడు.

"ఇన్ని మాటలెందుకుగానీ .. వదినగార్ని, పిల్లల్ని మా యింటికి తీసుకొస్తారా .. లేకపోతే మా యింటిల్లి పాదినీ మీ ఇంటికి రమ్మంటారా."

"ఓ .. అదా .. చంపేశావుగదమ్మా! ఇంకేమిటో నని హడలి చస్తున్నాను" ఫక్కున నవ్వేశాడు బాలినాయుడు.

"నాకు సమాధానం కావాలన్నయ్యగారూ. మీరు మాటమారిస్తే ఊరుకోనీసారి" శ్రీమతి అల్టిమేటం ఇచ్చింది.

"మేమూ రాము. మీరూ రానూవద్దు" నవ్వుతూ అన్నాడు బాలినాయుడు.

"ఏమండీ చూశారా! అన్నయ్యగారి కెంత గర్వమో?" రోషంగా ముక్కెగబీల్చింది శ్రీమతి.

ఇక నాకు నసాళానికెక్కింది. ఊరుకోలేకపోయాను. "అవును లేవోయ్ .. నీ కేమిటి వంటినిండా బంగారు నగలు పెట్టుకోగల భార్య వుంది. సరస్వతీ పుత్రుడయిన కొడుకున్నాడు. అందాలరాశి అయిన కూతురుంది. నువ్వు చూస్తే — బహుముఖ ప్రజ్ఞాశాలివి. జీవితంలో కారుతోపాటు అన్ని హంగులూ వున్న ఐశ్వర్యవంతుడివి.

నువ్వు మా యింటికి వచ్చి అందరితో కబుర్లు చెప్పకోవచ్చుగానీ .. మాకు మీ యింటికి వచ్చి మీకుటుంబ సభ్యులతో మాట్లాడే అర్హత లేదు కదూ? మీ ఫామిలీ మాలాంటివాళ్ళ ఇంటికి వస్తే మీకు పరువు తక్కువయ్యె!" అన్నాను మాటల్ని ఈటెలుగా చేసి పొడుస్తూ.

ఒక్కసారిగా బాలినాయుడి ముఖం మలినమయింది. నేను కోరుకున్నదీ అదే ...! అయినా క్షణాల్లోనే తేరుకొని "ఇంత చిన్న విషయానికి ఇంటిల్లిపాదీ నా మీద కత్తికట్టారన్న మాట. సరే ... రేపు రాత్రి ఏడు గంటలకు మీరంతా మా ఇంటికి భోజనానికి వస్తున్నారు. ఆరు ముప్పావుకల్లా కారు పంపిస్తాను. ఇకనయినా నాకీ టిఫిన్ తినే ప్రాప్తం కలిగిస్తారా .. ఏం చెల్లెమ్మా! ఏం పిల్లలూ .. ఏమిటోయ్?" అన్నాడు బాలినాయుడు చనువుగా సరదాగా.

అందరి ముఖాలలోనూ సంతోషం గంతులేసింది.

థాంక్స్ చెపుతూ బాలినాయుడి చేత కొసరి కొసరి టిఫిన్ తినిపించాం.

మర్నాడు సాయంత్రం ఏడు గంటలకల్లా ... బాలినాయుడు పంపించిన కార్లో మా ఫామిలీ అంతా



అతని ఇంటికి వెళ్ళాం. ప్యాలెస్ లాంటి బాలినాయుడి భవనం ముందు ... మమ్మల్ని రిసీవ్ చేసుకునేందుకు ఎవరూ కనిపించలేదు. బాలినాయుడి జాడే లేదు. మమ్మల్ని దింపి కారు డ్రైవర్ ఎటో వెళ్ళిపోయాడు. చివుక్కుమనిపించింది నాకు.

బిక్కుబిక్కుమంటూ మేం నలుగురం లోపలికి అడుగులు వేశాం.

హడావుడిగా తిరుగుతున్న ఒకరిద్దరు పనిమనుషులు మేం చెప్పేది వినిపించుకోవడం ఇష్టం లేనట్టుగా అటుగా వెళ్ళిపోయారు.

లోపలి నుంచి ఎవరివో మాటలు గట్టిగా వినిపిస్తున్నాయ్. బాలినాయుడి గొంతు బతిమాలుకుంటోంది. "ఒసేయ్ సుబ్బూ! ఈ పూటకి ఎలాగోలా నా మాట దక్కించవే. నా పరువు నిలువునా తియ్యకే."

"ఏందయ్యా వాగుతున్నావ్ నోర్మూసుకో. నేను తెచ్చిన కట్నం డబ్బూ, బంగారం వల్లే గదయ్యా నీకు దశ తిరిగింది వ్యాపారంలో ... లేకపోతే అంతకు ముందు నీ బోడి బట్టలషాపులో ఎవడు కొనేవాడు? ఇప్పుడు చూడు ... గుమస్తాలని, మేనేజర్లని పెట్టి ... వ్యాపారం ఎలా జరుగుతోందో? ఇదంతా నా మహిమ! అలాంటి దాన్ని నా మాటని కాదని .. నీ స్నేహితుణ్ణీ, వాడి పెళ్ళాన్ని, పిల్లల్ని ఇంటికి తిళ్ళకి తీసుకొస్తున్నావంటే ఎందుకో తెలుసుకోలేని పిచ్చిదాన్ననుకున్నావా? నీ పనికి మాలిన రాతలు ... చెత్తకారి పాటలు .. అణాకానీ ఆటల గురించి కథలు .. చెప్పి .. ఇంటిల్లిపాదినీ బుట్టలో పెట్టేవుంటావ్. కారులో షికార్లు తిప్పి .. డబ్బు పెట్టి ... వాడి పెళ్ళాన్ని పట్టేసి వుంటావ్! లేకపోతే .. వాడొట్టి చవట కాకపోతే ... నువ్వు రమ్మన గానే .. వాడి పెళ్ళాన్ని, పిల్లల్ని తీసుకొని ... ఎందుకు వచ్చేస్తాడు? పైగా నువ్వు కారు కూడా పంపించావంటే ... ఇందులో ... ఏదో గ్రంథం వుందన్నమాటే! కదుటే అమ్మాయ్? కదరా అబ్బాయ్?" పులి గాండ్రిస్తున్నట్టుగా వున్న గొంతు.

బాలినాయుడి భార్య నోటమ్మట ఆ ఛండాలపు మాటలు వినగానే నా మనసు కకావికలైపోయింది. బాధగా శ్రీమతి వేపు చూశాను. ఆమె కళ్ళు వర్షించడానికి సిద్ధంగా వున్నాయ్.

మా అమ్మాయి ... అబ్బాయి కళ్ళల్లో అగ్నిగోళాలు!

నన్ను నేను అదుపు చేసుకుంటూ మౌనంగా వాళ్ళకి సైగలు చేసి .. బాలినాయుడి ఇంట్లోంచి బయటపడి మేమంతా రిక్షాలు ఎక్కి ఇంటికి చేరాం. అందరికీ గుండె బరువెక్కిపోయింది. ఎవరితో ఎవరూ మాట్లాడకుండా పడుకుని నిద్రపోయాం. ఆ రాత్రి నిద్రలో అన్నీ పాడు కలలే నాకు!

మరుసటి రోజు రోషంగా అంది శ్రీమతి "ఇక మంచీ అన్నయ్యగారిని మన ఇంటికి రానీయకండి! వాళ్ళావిడ చక్కని సంబంధం అంటగట్టిందిగా మరి?"

"పిచ్చీ! ఎవతో మూర్ఖురాలు ఎందుకూ పనికిరాని మాటందని ఒక్కసారికే ఇంత బాధపడుతున్నావే ... పేరున్న నటుడు, గుర్తింపు గల రచయిత .. తియ్యటి గొంతున్న గాయకుడు .. అమితమైన విషయ పరిజ్ఞానం వున్నవాడు .. బహుముఖ ప్రజ్ఞాశాలి .. సద్గుణ సంపన్నుడయిన స్నేహశీలి .. అతను — కుసంస్కారి, అవివేకి అయిన భార్యవేసే నిందలకు ఎంతగా బాధపడి వుండాలి? ఈ విషయాన్ని మింగలేక, కక్కలేక ... ఇంతకు ముందు మనల్ని వాళ్ళింటికి ఆహ్వానించలేకపోయాడు. అలాగే తన ఫామిలీని మనింటికి తీసుకురాలేకపోయాడు. అతని పరిస్థితికి జాలిపడి ఓదార్పు నందించవలసిన మనమే అతన్ని తిరస్కరిస్తే ... ఇక స్నేహమన్న పదానికి అర్థమేలేదు. ఏమంటావ్?" అన్నాను.

కాసేపు ఆలోచించి నా అభిప్రాయంతో ఏకీభవించింది శ్రీమతి.

బాలినాయుడికి ఇక ముందు కూడా స్నేహపూర్వకమైన మర్యాదల్ని అందించేట్టుగా అందరం తీర్మానించుకున్నాం.

తరువాత రోజు బాలినాయుడు నా షాపుకు వచ్చి "నన్ను క్షమించవోయ్" అన్నాడు తలదించుకుని. "డ్రైవర్ మిమ్మల్ని తీసుకొచ్చినట్టు చెప్పాడు" అన్నాడు నా చెయ్యి పట్టుకుని.

"ఆ మాట అనవలసింది నువ్వు కాదు బాలినాయుడూ. నేను" అన్నాను అతని భుజం తడుతూ.

ఆశ్చర్యపోయాడు బాలినాయుడు.

"ఇదివరకటిలాగే నువ్వు మా యింటికి వస్తుండమని మీ చెల్లెమ్మ చెప్పింది" అన్నాను స్నేహపూర్వకంగా.

అతని కంటి నుంచి జారిన కన్నీటి బొట్టు నా చేతి మీద పడింది.

నేను భారంగా నిట్టూర్చాను.*